# కథ

సీత అల్లరిపిల్ల

"మామయ్యా"

"... ... ... ..."

"మామయ్యా! మామయ్యా!"

"... ... ..."

"మామయ్యోయ్! పలకవేం, బెల్లంగడ్డ నోట్లో పెట్టుకున్నావా?"

"వోయ్"

"అమ్మయ్య! ఇప్పటికి వినిపించింది!"

"ఎందుకమ్మా ఆ హడావిడి?"

"నాకు కథ చెప్పాలి. చెప్తావా, చెప్పవా?"

"ఇప్పుడు కథేమిటమ్మా!"

"ఏం?"

"కథలు రాత్రిపూట చెప్పుకోవాలిగాని, పగలు కాదు."

“పగలవుతేనేం?”

“ఏమీ లేదు.”

“అవుతే చెప్పు.”

ఆ బాలతో వాదించలేక మామయ్య వోడిపోతాడు.

“అనగా అనగా ఓ ఊళ్లో ఓ రాజుండేవాడు. ఆ ఆ రాజుకి ఏడుగురు కొడుకులు...”

“ఏడుగురూ వేటికెళ్లి ఏడు చేపలు తీసుకొచ్చారు...”

“నీకు తెలుసేమిటి ఆ కథ?”

“ఛీ. ఎప్పుడూ ఆ కథేనా? ఇంకోటి చెప్పు. నాకది అక్కర్లేదు.”

“అనగా అనగా వోఊళ్లో...”

“ప్రతి కథా మొదలెట్టడానికి ముందర ‘అనగా అనగా’ అనడం ఎందుకు?”

“పెద్దవాళ్లలా అంటూంటారు. అంచేత నేనూ అన్నా.”

“అవుతే పెద్దవాళ్లు చేసే పనులన్నీ మనం చెయ్యొచ్చా?”

“చెయ్యకూడదు. వాళ్లు చెప్పినట్లు మనం చెయ్యాలి. వాళ్లు చేసేటట్లు కాదు.”

"అదేమిటి మామయ్యా? వాళ్ళకి చేతకాక పన్ని చెయ్యమంటారన్నమాట."

"కథ మొదలెట్టగానే నీకిన్ని సందేహాలు వస్తుంటాయెందుచేత? కథవద్దా?"

"ఆ ఆ మర్చిపోయాను. చెప్పు."

"ఒక ఊళ్ళో వో ఈగవుంది."

"ఏం ఈగ?"

"మనం రోజూ చూస్తూండే ఈగ."

"కుక్కపిల్ల..."

"నీ మొహం. కుక్కపిల్లేమిటి?"

"అది కాదు, మామయ్యా! మన కుక్కపిల్ల సరిగ్గా అన్నం తినక మెతుకులు పారేస్తే చుట్టూ మూగుతాయి; అవేనా ఈగలు?"

"ఊ, ఆ ఈగ ఒకరోజున—"

"ఏ ఈగ?"

"మనం రోజూ చూస్తుండే ఈగల్లో ఒక ఈగ."

"కుక్కపిల్లదగ్గరుండే ఈగల్లో ఒకటేనా?"

"అవును. ఆ ఈగ ఒకరోజున యిల్లు... ..."

"కుక్కపిల్ల దగ్గరేనా ఈగలు వుండేది, మరింకెక్కడా వుండవ్!"

"వుండకేం?"

"ఎక్కడుంటాయ్?"

"జిలేబి, హల్వా మొదలైన తీపివస్తువులచుట్టూ మూగుతాయి."

"ఏం మామయ్యా! జిలేబి నీకు నచ్చుతుందా?"

"కథమాటమర్చిపోయావు."

"కథకేంగాని, నాకిప్పుడు జిలేబికావాలి."

"కథఅయిపోయిన తర్వాత కాఫీహోటల్‌కి పోయి తిందాం."

"ఇంకా ఎంతసేపటికి అవుతుంది కథ? నాకు రూరుతోంది, త్వరగా అవనీ."

"నువ్వు పిచ్చిపిచ్చిప్రశ్నల్తో నన్ను బాధించకుండావుంటే శీఘ్రంగానే అయిపోతుంది."

"అవుతే త్వరగాకానీ."

"ఆ ఈగ ఒకరోజున యిల్లుఅలుకుతూ——"

"ఏ ఈగ? మునుపటి ఈగేకాదూ?"

"... పేరు మర్చిపోయింది..."

"అమ్మ చేయించుకొన్న కానులపేరు లాటిదేనా? అమ్మకూడా ఒకరోజున హాల్లో బల్లమీద పెట్టి మర్చిపోయింది."

"అలాటిదికాదు. మనుషులకుండే పేరు."

"ఏం. —అమ్మ మనిషికాదా?"

“అదికాదు, సీతా, నీపేరేమిటి?”

“నాపేరా… …”

“అవును. నీపేరే?”

“నాపేరా… …నాపేరా…”

“అవును. పేరు చెప్పేటందుకంత సందేహిస్తా వేమిటి?”

“మామయ్యా, చిన్నపిల్లని చేసి నాతో వేళా కోళాలాడ్తావెందుకు?”

“ఏమిటది?”

“నాకు పేరులేదని నీకు తెలీదూ? అమ్మ పెళ్లయే వరకూ చేయించనని అంది. నాన్నగారి నడిగితే, యింకో పదేళ్లు పోయేవరకూ పెళ్లే చెయ్యనన్నారు.”

“నీ మొహం. పిచ్చివాగుడూ, నువ్వూ నూ. పేరంటే అందరూ నిన్ను పిలిచే పేరన్నమాట.”

“… … … … … …”

“చెప్పేది విను. ప్రతి మనిషికీ ఒక పేరు వుంటుంది.”

‘నాఖర్మం. నాకుమాత్రం లేదు.”

“మొద్దూ, పూర్తిగా విను. నీ పేరు సీత.”

“ఆ సంగతి నువ్వు చెప్పేదేమిటి? మా నాన్న

గారు 'సీత' అని నేను పుట్టినప్పుడు బియ్యంలో వ్రాశారట, నిజమేనా?"

"నిజమే!"

"ఎందుకు వ్రాయాలలా?"

"మళ్లీ మొదటికొచ్చావ్. కథ మాట మర్చి పోయావు."

"జిలేబీల దగ్గరుండే ఈగ కథేనా?"

"ఊ."

"ఈగకథ వద్దు. జిలేబీలు తిందాం రా."

"కథ అయిపోనీ."

"కథావద్దు, గిథావద్దు. ఇప్పుడే రావాలి. నా కడుపులో ఆకలి మండిపోతోంది"

"అన్నం తినలేదూ?"

"తిన్నా. ఇది జిలేబీ ఆకలి."

"సీతా! సీతా!!" అని లోపలనుంచి పిలుపు.

"అమ్మ కేకేస్తోంది, వెళ్లిరా."

"నిముషంలో వస్తా. కోటేసుకొని సిద్ధంగా వుండు. కాఫీహోటల్‌కిపోయి అరడజను జిలేబీలు తినాలి," అని అంటూ చివ్వున లోపలికి పరుగెత్తు తుంది సీత.

(జూలై 1936)